క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

చిట్యాల: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నేడు (సోమవారం) హాజరుకానున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆరెపెల్లి మల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

నేడు సర్వసభ్య సమావేశం

కన్నాయిగూడెం: మండలం కేంద్రంలో నేడు (సోమవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫణిచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ జనగం సమ్మక్క అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని వెల్లడించారు.

బియ్యం అందజేత



ములుగు: జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కొయ్యడ సాంబయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి శ్రీ రామకృష్ణ సేవాట్రస్టు తరుపున బాడిష నవీన్ బాధిత కుటుంబ సభ్యులకు బియ్యం అందజేశారు. అలాగే బీఆర్ఎస్ యూత్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోగిల మహేష్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో లింగమూర్తి, కాకి భాస్కర్, కోతి కార్తిక్, మద్దెల రవితేజ, ఎంపెల్లి దిలీప్, చింత రాజు, కొయ్యడ రాజేందర్, గడ్డం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏలకు రక్షణ కల్పించాలి



వెంకటాపురం(కె): గ్రామ రెవెన్యూ సహాయకులకు(వీఆర్ఏ) రక్షణ కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కట్ల నర్సింహాచారి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీఐటీయూ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో గ్రామ రెవెన్యూ సహాయకులపై ఇటీవల పలువురు దాడి చేశారని వారిని వెంటనే శిక్షించాలని కోరారు. కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ కార్యాలయలంలో పని చేస్తున్న గిరిజనులకు, దళిత కార్మికులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు బ్రహ్మచారి, నాగచారి, ముత్తేష్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల



కన్నాయిగూడెం: మండలంలోని ముప్పనపల్లి జిల్లా పరిషత్ పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. దేవాలయాలు లాంటి విద్యాలయాలను మందుబాబులు తాగాడానికి వాడుతున్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరుగకుండా చూడాలని మండల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

నిండా ముంచిన వర్షాలు

- కొయ్యకుండానే మొలకెత్తుతున్న ధాన్యం
- ఆందోళనలో అన్నదాతలు

మహాముత్తారం: ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పండిచిన పంట చేతికొస్తున్న సమయంలో అకాల వర్షాలు అన్నదాతల ఆశలకు భారీగా గండికొట్టి విషాదం నింపుతున్నాయి. వరిపంట కొయ్యకుండానే నేలకొరిగి మళ్లీ మొలకెత్తే పరిస్థితి నెలకొంది. ఇటు కోతలు ప్రారంభం కాగానే అటు అకాలవర్షాలు చుట్టుముట్టడంతో పంటను కాపాడుకోలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలను ఇప్పుడిప్పుడే ప్రారంభించడంతో కల్లాల్లోనే ధాన్యం తడిసి ముద్దవుతుంది. మళ్లీ తుపాను హెచ్చరికలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు దాదాపు 8వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. గత ఐదు రోజులుగా కురిసిన అకాల వర్షానికి మండలంలోని నల్ల



కోనంపేటలో నీళ్లలో మునిగిన వరిని చూపుతున్న రైతులు

గుంటమీనాజీపేట, కిష్టాపూర్, నర్సింగాపూర్, కనుకునూర్, నిమ్మగూడెం, సింగంపల్లి, యత్నారం, ములుగుపల్లి, స్తంబంపల్లి, కోనంపేట తదితర గ్రామాల్లో 13వందల ఎకరాల్లోని వరిపంట నేలకొరిగినట్లు వ్యవసాయ అధికారులు అంచన వేశారు.



మొలకెత్తిన వరిని చూపుతున్న రైతు

రెండు కొనుగోలు కేంద్రాలు మాత్రమే ప్రారంభం

యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్ల కోసం మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు రెండు మాత్రమే ప్రారంభించారు. అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేక పోతున్నామని పీఏసీఎస్ అధికారులు చెప్తున్నారు. అకాల వర్షం నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

శిల్పకళా సంపద అద్భుతం

ఖిలా వరంగల్: ఖిలావరంగల్ కోట శిల్పకళా సంపద అద్భుతంగా ఉందని భూపాలపల్లి జిల్లా కోర్టు జడ్జిలు జయరాంరెడ్డి, రామచంద్రరావు అన్నారు. చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందిన కాకతీయుల రాజధాని ఖిలావరంగల్ కోటను వారి కుటుంబ సభ్యులో కలిసి ఆదివారం మధ్యాహ్నం సందర్శించారు. కాకతీయుల నాలుగు కీర్తితోరణాల మధ్య శిల్పాలు చెక్కిన అద్భుతమైన శిల్పకళా సంపదను వారు ఆసక్తిగా తిలకించారు. అనంతరం రాతి, మట్టికోట అందాలు, కుష్‌మహల్‌ను సందర్శించి కాకతీయుల కళాఖండాలను తమ వెంట తెచ్చుకున్న కెమెరాల్లో బంధించారు. అనంతరం ఖుషిమహల్, శృంగారపుబావి, ఏకశిల గుట్ట, పార్కు, గుండు చెరువు అందాలను వీక్షించారు. కాకతీయుల



శిల్పకళా నైపుణ్యాలను తిలకిస్తున్న జడ్జిలు

చరిత్ర, విశిష్టతను కోట గైడ్ దేనబోయిన రవియాదవ్ వారికి వివరించారు. కాకతీయుల కళాఖండాలు తమలను ఆకర్షితులను చేశాయని వారు సంతోషం వ్యక్తం చేశారు. వారి వెంట కేంద్ర పురావస్తు శాఖ సిబ్బంది, టీఎస్‌టీడీసీ ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ నగర సంకీర్తన



నగర సంకీర్తనలో మాలధారులు

ములుగు రూరల్: జిల్లాకేంద్రంలో హనుమాన్ నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ మాలధారణ భక్తులు ఆటపాటలతో స్వామివారిని ఊరేగింపు చేపట్టారు. రామాలయం నుంచి సీతారాములు, హనుమాన్ చిత్రపటాలను ఊరేగించగా భక్తులు స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. నగర సంకీర్తన కార్యక్రమంలో గురుస్వాములు పేరబోయిన శ్రీధర్, ఇమ్మడి రమేష్, తుమ్మ రామకృష్ణ, అరిగెల రవీందర్ ఆధ్వర్యంలో రాముల వారి కీర్తనలను ఆలపిస్తూ భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆవుల ప్రశాంత్‌రెడ్డి, కొనుపుల సంపత్, జక్కుల రాము, మనోహర్, భాస్కర్‌రెడ్డి, నాంపెల్లి నరేష్, బైకాని నట్రాజ్, నారిశెట్టి రమేష్, శంకర్, బైకాని కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



మంగపేట: మాట్లాడుతున్న ఏఈ ప్రశాంత్‌రెడ్డి

మంగపేట: విద్యుత్ ప్రమాదాలు, భద్రతా నియమాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఏఈ గుర్రాల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని మల్లూరు 33/11 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రైతులు, వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాలు, వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు తమ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. రైతులు పంట పొలాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ లైన్లలో ఏదైన సమస్య ఏర్పడితే వెంటనే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ యాకూబ్‌పాషా, లైన్‌మెన్ పసుపులేటి రవికుమార్, ఏఎల్ఎం సాంబశివరావు, సబ్‌స్టేషన్ ఆపరేటర్ తిరుపతిరెడ్డి రైతులు పాల్గొన్నారు.



వెంకటాపురం(కె): వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆలుబాక గ్రామంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ భద్రత వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ట్రాన్స్‌కో ఏడీఏ స్వామి రెడ్డి వివరించారు. అనంతరం విద్యుత్ భద్రత వారోతసవాలపై వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ సునీల్, సబ్ ఇంజనీర్ సూర్య ప్రకాష్ తదితరులు ఉన్నారు.

సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సీఐ శంకర్

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని కాటాపూర్ గ్రామానికి చెందిన డ్రైవర్ చెట్టుపల్లి రాజు ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడివాగు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సెకండ్ ఎస్సై ఇందయ్యతో పాటు మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్‌రావు, ఏటూరునాగారం ఎస్సై రమేష్, తాడ్వాయి ఎస్సై-2 శ్రావణ్‌కుమార్‌లు పరామర్శించి క్వింటా బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.10 వేల నగదు అందజేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సదుపాయాలను అందించేందుకు కృషి చేస్తామని సీఐ శంకర్ హామీ ఇచ్చారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ములుగు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని శ్రీగురు యోగాలం ట్రస్ట్ వ్యవస్థాపకుడు శివకృష్ణ అన్నారు. యోగాలయం తరుపున ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన యోగా శిక్షణకు స్థానికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ.. ప్రతీ నెల మొదటి ఆదివారం ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ



యోగా చేస్తున్న స్థానికులు

అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మొగుళ్లపల్లి: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని పిడిసిల్ల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకర పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన మక్కలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతును రాజు చేయడమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, సర్పంచ్‌లు మోటె ధర్మారావు, నైనకంటి ప్రభాకర్‌రెడ్డి, పెంతల రాజేందర్,



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

శ్రీనివాస్, పద్మవెంకట్‌రెడ్డి, నాయకులు నరహరి బక్కిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అండదండలతోనే దాడులు



రేగొండలో మాట్లాడుతున్న నర్సయ్య



చిట్యాలలో మాట్లాడుతున్న తిరుపతి

టేకుమట్ల(రేగొండ): ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అండదండలతోనే కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు దాడులు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య ఆరోపించారు. రేగొండలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టేకుమట్ల మండల అధ్యక్షుడు సతీష్‌పై బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీపీ చేసిన దాడిని ఖండించారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఎమ్మెల్యే అండదండలతో బీఆర్ఎస్ నాయకులు హింసను ప్రేరేపిస్తున్నారని మండిపడ్డారు. భూఆక్రమార్కులకు కొమ్ము కాస్తున్న ఎమ్మెల్యే తీరును మార్చుకోవాలని సూచించారు. ఆయన వెంట గూటోజు కిష్టయ్య, బానోతు రవిందర్, నాగపూరి మొగిళి, జోరు సుదర్శన్, తదితరులు ఉన్నారు.

చిట్యాలలో..

భూఆక్రమణను ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని కాంగ్రెస్ చిట్యాల మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం చిట్యాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టేకుమట్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడిపై మాజీ ఎంపీపీ దంపతులు దాడీ చేస్తూ హత్యకు యత్నించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం కొమురయ్య, ఎంపీటీసీ దబ్బెట అనిల్, బొట్ల రవి, దొడ్డి కిష్టయ్య, బుర్ర లక్ష్మణ్ పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

టేకుమట్ల: ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై కాంగ్రెస్ నాయకుడు గండ్ర సత్యనారాయణరావు అసత్య ఆరోపణలు మానుకోవాలని మాజీ ఎంపీపీ బందెల స్నేహలతనరేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సత్యనారాయణరావు ముందు నిజాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. భూకాబ్జాలకు పాల్పడుతున్నట్లు నిరుస్తే దేనికైన సిద్ధం అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి,



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

కాటారం: కాటారంలో మున్నూరుకాపు సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.10 లక్షల నిధులు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో మున్నూరుకాపు సంఘం నాయకులు మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ.. మున్నూరు కాపు కులస్తుల సంక్షేమం కోరుతూ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో మాట్లాడిన ఏకైక ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అని కొనియాడారు. మంథని నియోజకవర్గంలోని మున్నూరుకాపు కులస్తుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తున్న శ్రీధర్‌బాబుకు సంఘం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొట్టె శ్రీశైలం, కొట్టె ప్రభాకర్, చీమల వెంకటస్వామి, సర్పంచ్ అంగజాల అశోక్, చీమల రాజు, కవ్వాల శేఖర్, పసుల రాంచంద్రం, చీమల సందీప్, నరేశ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మామిడి 'కాయ'లేదు!

- కాత లేని తోటలు
- ప్రతీ ఏడాది ఎగుమతి.. మూడేళ్లుగా దిగుమతి!

వాజేడు: మార్కెట్లో వాజేడు మండలంలోని మామిడికాయలకు ప్రత్యేక డిమాండ్ ఉంది. వాజేడు నుంచి నాగపూర్, రాజమండ్రి, సికింద్రాబాద్ తదితర సుదూర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రతీ సంవత్సరం మామిడి రైతులు తమ తోటల్లో కాసిన మామిడి కాయలను సుదూర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. అలాంటిది గత మూడు సంవత్సరాలుగా మండల వ్యాప్తంగా మామిడి చెట్లు కాయడం లేదు. మండల వ్యాప్తంగా దాదాపు 100 ఎకరాలకు పైగా మామిడి తోటలు ఉన్నాయి. వాజేడు, బాడువా, ఏడ్జర్లపల్లి, గుమ్మడిదొడ్డి, తోగు, కొంగాల, దూలాపురం, అరుణాచలపురం తదితర గ్రామాల్లో ఈ తోటలు ఉన్నాయి. బంగనపల్లి, పాపారావు గోవా, సూరన్‌రేఖ, కొబ్బరి బొండాం, కొత్తపల్లి కొబ్బరి, కలెక్టర్, ఛత్తీస్‌గఢ్ మామిడి, జాంగ్రి ఇలా పలు రకాల కాయలు కాసే తోటలు ఇక్కడ ఉన్నాయి. ప్రతీ సంవత్సరం విరివిగా కాయలు కాయడంతో వీటిని సుదూర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. పచ్చడ మామిడి కాయలతో పాటు బంగనపల్లి, పాపారావు గోవ, రసాలు లాంటి రకాల కాయల కోసం వెంకటాపురం, చర్ల, భద్రాచలం, ఏటూరునాగారం నుంచి వచ్చి కొనుగొలు చేసుకుని వెళ్లేవారు. ఈ సంవత్సరం కూడా కాయలు కాయక పోవడంతో



కాయలు లేని మామిడి చెట్టు

మామిడి ప్రియులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా పచ్చడ కాయలను ఎక్కడ కొనుగోలు చేయాలో అర్థం కాక అయోమయంలో పడుతున్నారు. మామిడి తోటలను కౌలుకు తీసుకున్న రైతులు తోటలను చూసి వదిలేశారు. కొన్ని తోటలను కౌలుకు తీసుకోవడానికి ఎవరు ముందుకు రాలేదు. కాయలు కాయక పోవడంతో కౌలు రైతుల వద్ద అడ్వాన్సగా తీసుకున్న డబ్బులను తోట యజమానులు తిరిగి చెల్లించాల్సిన పరిస్థితి.

పచ్చళ్లకు కష్టమే

ఆవగాయ, ఊరగాయ పచ్చళ్లకు వాజేడు మామిడి కాయలు ప్రసిద్ధి గాంచినవి. ఇక్కడ కాసిన కాయలతో పెట్టిన పచ్చళ్లు ఎక్కువ కాలం నిల్వ ఉంటుండటంతో డిమాండ్ ఎక్కువగా ఉండేది. అలాంటిది ఈ సంవత్సరం కాయలు కాయక పోవడంతో పచ్చళ్లను ఎలా పెట్టాలో అర్థం కావడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. నల్లి పరుగు కారణంగా పేను ఎక్కువగా వచ్చి మామిడి కాయలు కాయ లేదని కొందరు రైతుల అంటున్నారు. కాగా పచ్చడ మామిడి కాయల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు.

పదో రోజు జేపీఎస్‌ల సమ్మె

టేకుమట్ల/రేగొండ: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ చేపట్టిన సమ్మె ఆదివారం పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లెల అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకంగా ఉందన్నారు. ప్రభుత్వం కార్యదర్శుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మల్హర్: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జూనియర్ (జేపీఎస్) పంచాయతీ, ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు చేపడుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా 10వ రోజు ఆదివారం వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శులకు సమ్మెకు దుబ్బపేట సర్పంచ్ ప్రమీల రాజునాయక్ సంఘీభావం తెలుపుతూ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జేపీఎస్ సంఘం మండల అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి కుమాస్వామి, సమ్మరాజు, ప్రసాద్, సాయిచరణ్, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె ఆదివారం పదో రోజుకు చేరుకుంది .ఈ సందర్భంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే తమమ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి మౌనిక, కార్యవర్గ సభ్యులు మమత, మౌనిక, శారద, అజీరాబేగం, అన్వర్, హేమంత్, శిరీష, దుర్గ భవాని, నాగార్జున, శ్రావణి, సుమత, ఇంద్రసేన, సునీల్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

ములుగు: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్) జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న నిరవధిక సమ్మె ఆదివారంతో 10వ రోజుకు చేరుకుంది. దీక్ష శిబిరం వద్ద వంటా వార్పు చేసిన జేపీఎస్‌లు నిరసన తెలిపారు. రెగ్యులరైజ్ చేసేంత వరకు సమ్మెను విరమింపజేసేది లేదని నినాదాలు చేశారు.

కాటారం: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కాటారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతుంది. ఆదివారం సమ్మె శిబిరం వద్ద జేపీఎస్‌లు వంటవార్పు చేపట్టి విన్నూత్న నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జేపీఎస్‌ల సంఘం నాయకులు బీరెల్లి కరుణాకర్, చీర్ల రజిత, రాకేశ్, నాగరాజు, సునీత తదితరులు పాల్గొన్నారు.



ములుగులో..



టేకుమట్ల: సమ్మెకు మద్దతుగా చిన్నారి



రేగొండలో..

బాధిత కుటుంబానికి పరామర్శ

మంగపేట: మండలంలోని తిమ్మంపేటలో ఇటీవల విషజ్వరంతో స్రవంతి మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని ములుగు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్ ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు యగ్గడి అర్జున్, అబ్బు శ్యామ్, రాజేందర్, ప్రహ్లాద్ యువసేన నాయకులు కటుకోజు ప్రశాంత్, గుండు రాజేష్, కోరెం వెంకటేశ్వర్లు, భాస్కర్, బంటు విజయ్, అరున్, నరెందర్, శ్రీను, బలకృష్ణ, గణేష్ తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న ప్రహ్లాద్